www.siridaily.com
RNI TG TEL/ 26/A0381
# సిరి
People's Voice వార్తపత్రిక
సోమవారం
02-03-2026
సంపుటి (Volume) : 2
సంచిక (Issue) 72
MEDAK, SANGAREDDY, SIDDIPET
పేజీలు : 10

## ఈ పాపం ఎవరిది !?

### కలెక్టరమ్మా.. కనికరించమ్మా!

- రెగ్యులర్ డీపీవో లేక పంచాయతీ పాలన అస్తవ్యస్థం
- అధికారుల నిర్లక్ష్యానికి కార్యదర్శి కుటుంబం బలి
- ఆ కుటుంబానికి దిక్కెవరు ?
- కలెక్టర్ వద్ద ఆగిపోయిన రెగ్యులరైజ్ ఫైల్
- రెగ్యులర్ కాలేక వందలాది జూనియర్ కార్యదర్శుల ఎదురుచూపులు


5






# కబ్జాకోరులకు మరో షాక్?

- బ్లాక్‌లో ఓపెన్ స్పేస్ ఎక్కడ..?
- తెల్లాపూర్‌లో మరో వివాదానికి తెర
- తహసీల్దార్ వీడియో వైరల్‌తో కలకలం
- జిల్లా కలెక్టర్‌కు లేఖ రాసినా పట్టింపులేదా ?
- అధికారులకు స్థానికుల సూటిప్రశ్నలు







### తెల్లాపూర్ హెచ్ఎండీఏ భూముల కబ్జాపై ట్విస్టులు

రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ హెచ్ఎండీఏ భూముల అన్యాక్రాంతంపై రోజుకో ట్విస్టు బయటపడుతోంది. హెచ్ఎండీఏ భూముల కబ్జా, ఖాళీ స్థలాల ఆక్రమణ, అక్రమ నిర్మాణాలపై సిరి దినపత్రిక వరుస కథనాలను ప్రచురిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగానే తాజాగా అప్పటి తహసీల్దార్ హెచ్ఎండీఏ అధికారులతో హెచ్ఎండీఏ భూములు అన్యాక్రాంతం విషయంలో మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మరింత బలం చేకూరింది. దీంతో ఏ బ్లాక్‌లో ఖాళీ స్థలంపై కొత్త కోణాలు ముందుకొచ్చాయి. ఇదే విషయంలో స్థానికులు పలు డిమాండ్లను వెల్లడిస్తున్నారు. ఇందుకు అధికారులు ఎలాంటి సమాధానాలు ఇస్తారో వేచిచూడాల్సిందే. మండల స్థాయి అధికారి జిల్లా కలెక్టర్‌కు లేఖ రాసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం వెనుక ఆంతర్యమేమిటో తేల్చాల్సిన సమయం ఆసన్నమైంది.

- రామచంద్రపురం, (సిరిన్యూస్)

3



## కో ఆప్షన్ పదవిపై కంది ప్రభాకర్ అసంతృప్తి!?

### పార్టీకి ఎనలేని సేవలందిస్తే గుర్తింపు లేదా ?

4

- బీజేపీ పెద్దల హామీ నీటిమూటేనా ?
- పార్టీ వ్యవహారంపై ప్రభాకర్ తీవ్ర నిరాశ
- కో ఆప్షన్ కంది బబితకు ఇవ్వాలని కార్యకర్తల డిమాండ్



## ఓటమిని జీర్ణించుకోలేక డ్రామాలాడుతున్నారు

- ప్రజల దృష్టి మళ్లీంచేందుకే కాంగ్రెస్ పై బిఆర్ఎస్ ఆరోపణలు
- అధికారంలో ఉండగా ప్రజలకు చేసిందేమిలేదు
- ఎమ్మెల్యే ను విమర్శిస్తే సహించేదిలేదు
- ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతుంది కాంగ్రెస్ పార్టీ
- మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్

6

మెదక్ ప్రతినిధి,మార్చి01(సిరి న్యూస్) మున్సిపల్ ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేక బిఆర్ఎస్ నేతలు డ్రామాలాడుతున్నారని మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ విమర్శించారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు.ప్రజల దృష్టి మళ్లీంచేందుకే కాంగ్రెస్ పై బిఆర్ఎస్ ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు.

## ఆనందాల రంగుల కేళి–హోలీ

- ప్రకృతి సంపాదించిన రంగుల రాగం హోలీ పండుగ
- రసాయనలతో కూడిన రంగులు వద్దు
- రంగు రంగు హోలీతో జాగ్రత్త సుమా
- సహజ సిద్ధమైన రంగులనే వాడుదాం
- ఆనందోత్సవాల మధ్య రంగుల పండుగ జరుపుకుందాం

6



# అందరి సహకారంతో పెద్దమ్మ గుడి నిర్మాణానికి శ్రీకారం

- **ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో కౌన్సిలర్ల సన్మానం**
- **పూర్తి సహకారం అందిస్తామని చైర్మన్ కుమార్ గౌడ్ హామీ**

**గుమ్మడిదల, మార్చి 1 (సిరి న్యూస్):** అందరి సహకారంతో గుమ్మడిదలలో పెద్దమ్మ గుడి నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నట్లు మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ తెలిపారు. ఆదివారం గుమ్మడిదల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కాశబోయిన ఆంజనేయులు ఆధ్వర్యంలో సంఘం భవనంలో నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన కౌన్సిలర్లకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం చైర్మన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ గుడి నిర్మాణానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆలయ నిర్మాణాన్ని తప్పకుండా ప్రారంభించి పూర్తి చేయాలని కోరారు. రైతులు సహకరించకపోవడంతో ఆలయ నిర్మాణం నిలిచిపోయిందని పేర్కొన్నారు. రైతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించి ఆలయ నిర్మాణం వేగవంతం చేయాలని సూచించారు. గుమ్మడిదల నుంచి మంబాపూర్ వరకు ఆలయం ఉన్న ప్రదేశం నుంచి బీటీ రోడ్డు ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. సంఘం సమీపంలోని 11, 12 వార్డులలో కౌన్సిలర్లను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వరుస క్రమంలో అమలు చేస్తామని చైర్మన్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు జిన్న శంకర్, కాశ బోయిన కుమార్, పెద్దోళ్ల విట్టల్ , ధనుంజయ్, గాండ్ల బిక్షపతి, నారాయణస్వామి, మొగులయ్య, భాస్కర్, అతినారం రాము, బండాల భాషయ్య, బండాల అనిల్, నాయకులు పాల్గొన్నారు.



## కౌన్సిలర్లకు ఘనంగా సన్మానం

పురపాలక సంఘం గుమ్మడిదలలో ముదిరాజ్ సంఘం, గొల్ల కురుమ సంఘం, యాదవ సంఘం ఆధ్వర్యంలో చైర్మన్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్య గోవర్ధన్ రెడ్డి, కౌన్సిలర్ ప్రమీల సంజీవరెడ్డి, మూడు చింతల నరేందర్ రెడ్డి, ఆకుల మాధవి, కత్తుల రమేష్, సురభి కుమార్ గౌడ్, చక్రపాణి, సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, యువ నాయకులు పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, హుస్సేన్, శేఖర్ రెడ్డి లను వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం లను నిర్వహించారు.





# అభివృద్ధి కార్యక్రమాలకు నాంది పలకడమే శంకుస్థాపన

- **గుమ్మడిదల 15వ వార్డు అంబేద్కర్ కాలనీలో స్వాగత తోరణం శంకుస్థాపన**

**గుమ్మడిదల, మార్చి 1 (సిరి న్యూస్):** గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు అంబేద్కర్ కాలనీలో స్వాగత తోరణం (కమాన్) నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో 15వ వార్డు తరపున బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన కౌన్సిలర్ పొన్నాల ప్రమీల సంజీవరెడ్డి, తాను గెలిస్తే కాలనీలో స్వాగత తోరణం నిర్మిస్తానని ప్రజలకు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రజలు తనపై నమ్మకం ఉంచి గెలిపించారని, ఇచ్చిన మాట నిలబెట్టుకునే ఉద్దేశంతో స్వాగత తోరణం నిర్మాణానికి శ్రీకారం చుట్టామని ఆమె తెలిపారు. కౌన్సిలర్ తనయుడు భారత రాష్ట్ర సమితి యువ నాయకుడు పొన్నాల శ్రీనివాస్ రెడ్డి తన సొంత నిధులతో స్వాగత తోరణం నిర్మాణానికి ముందుకు రావడం విశేషం. తల్లి ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా తాను భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్య గోవర్ధన్ రెడ్డి, కౌన్సిలర్ ప్రమీల సంజీవరెడ్డి, మూడు చింతల నరేందర్ రెడ్డి, ఆకుల మాధవి, కత్తుల రమేష్, సురభి కుమార్ గౌడ్, కిషన్, సంజీవరెడ్డి, చక్రపాణి, సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, యువ నాయకులు పొన్నాల శ్రీనివాస్ రెడ్డి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ స్వాగత తోరణం నిర్మాణం వల్ల అంబేద్కర్ కాలనీకి ప్రత్యేకమైన గుర్తింపు వస్తుంది. కాలనీ అందం పెరగడమే కాకుండా అభివృద్ధి కార్యక్రమాలకు ఇది నాంది అవుతుందన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతామని తెలిపారు. స్థానిక ప్రజలు ఈ కార్యక్రమాన్ని స్వాగతిస్తూ కౌన్సిలర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు ఆంజనేయులు, హుస్సేన్, శేఖర్ రెడ్డి, వర్తక సంఘం అధ్యక్షులు సత్యనారాయణ, రైతు సంఘం అధ్యక్షులు సదానంద రెడ్డి, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు తుడుము రవి తదితరులు పాల్గొన్నారు




# సిద్దిపేట అన్ని రంగాల్లో ఆదర్శంగా ఉంది

## మాజీ మంత్రి హరీష్ రావు

**సిద్దిపేట మార్చి 1( సిరి న్యూస్)** సిద్దిపేట అన్నింట్లో ఆదర్శంగా ఉందని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు పేర్కొన్నారు.చదువుతో పాటు వ్రాయడం కూడా చాలా ముఖ్యమని, ఏకాగ్రతతో చదివితే లక్ష్యాన్ని సాధిస్తామని తెలిపారు.ఆత్మవిశ్వాసం తో చదివితే అనుకున్న లక్ష్యాన్ని చేరుతారని, బాగా చదివి ఆల్ ఇండియా సర్వీస్ లో స్థానం సాధించాలన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రం లోని ఇందిరా నగర్ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు విజయీభవ ప్రేరణ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు పాల్గొన్నారు.10వ తరగతి అనేది జీవితంలో ఒక్క మెట్టుఅని, నియోజక వర్గం నుండి 2875మంది విద్యార్థులు పది పరీక్షలు రాయబోతున్నారన్నారు. పేద పిల్లలు మాత్రమే ప్రభుత్వ పాఠశాలలో చదువుతారు, కానీ వారే మెరికలాంటి విద్యార్థులు అన్నారు. విద్యార్థులు కష్టపడి కాదు ఇష్టపడి చదవాలన్నారు. సిద్దిపేట నియోజక వర్గంలో ప్రభుత్వ పాఠశాలలో చదివి టాప్ ర్యాంక్ సాధించిన 20మంది విద్యార్థులకు ఐ ప్యాడ్ గిఫ్ట్ గా ఇస్తానన్నారు.





# కబ్జాకోరులకు మరో షాక్?

## తెల్లాపూర్ హెచ్‌ఎండీఏ భూముల కబ్జాపై ట్విస్టులు

- బ్లాక్‌లో ఓపెన్ స్పేస్ ఎక్కడ..?
- తెల్లాపూర్‌లో మరో వివాదానికి తెర
- తహసీల్దార్ వీడియో వైరల్‌తో కలకలం
- జిల్లా కలెక్టర్‌కు లేఖ రాసినా పట్టింపులేదా ?
- అధికారులకు స్థానికుల సూటిప్రశ్నలు



**రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ హెచ్‌ఎండీఏ భూముల అన్యాక్రాంతంపై రోజుకో ట్విస్టు బయటపడుతోంది. హెచ్‌ఎండీఏ భూముల కబ్జా, ఖాళీ స్థలాల ఆక్రమణ, అక్రమ నిర్మాణాలపై సిరి దినపత్రిక వరుస కథనాలను ప్రచురిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగానే తాజాగా అప్పటి తహసీల్దార్ హెచ్‌ఎండీఏ అధికారులతో హెచ్‌ఎండీఏ భూములు అన్యాక్రాంతం విషయంలో మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మరింత బలం చేకూరింది. దీంతో ఏ బ్లాక్‌లో ఖాళీ స్థలంపై కొత్త కోణాలు ముందుకొచ్చాయి. ఇదే విషయంలో స్థానికులు పలు డిమాండ్లను వెల్లడిస్తున్నారు. ఇందుకు అధికారులు ఎలాంటి సమాధానాలు ఇస్తారో వేచిచూడాల్సిందే. మండల స్థాయి అధికారి జిల్లా కలెక్టర్‌కు లేఖ రాసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక ఆంతర్యమేమిటో తేల్చాల్సిన సమయం ఆసన్నమైంది.**

**రామచంద్రపురం, మార్చి 1(సిరిన్యూస్)**
తెల్లాపూర్ లో భూమి కబ్జాలపై సిరి దినపత్రికలో వెలువడుతున్న వరుస కథనాలకు తాజాగా మరింత బలం చేకూరింది. తెల్లాపూర్ ఏ బ్లాక్ పరిధిలోని హెచ్‌ఎండీఏ భూములు ఆక్రమణకు గురయ్యాయని అప్పటి రామచంద్రపురం తహశీల్దార్ స్వయంగా ఫోన్ ద్వారా హెచ్‌ఎండీఏ అధికారులకు ఫిర్యాదు చేసిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీంతో ఏ బ్లాక్‌లో ఓపెన్ స్పేస్‌ల పరిస్థితిపై కొత్త అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### తహసీల్దార్ హెచ్చరికలు... చర్యలు ఎక్కడ?

వైరల్ వీడియోలో ఏ బ్లాక్ పరిధిలోని హెచ్‌ఎండీఏ భూమిపై భారీ అపార్ట్మెంట్లు నిర్మాణం జరుగుతోందని తహశీల్దార్ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. హెచ్‌ఎండీఏ, మున్సిపల్, రెవెన్యూ శాఖలతో కలిసి జాయింట్ సర్వే నిర్వహించాలని ఆయన సూచించినట్లు సమాచారం. అదేవిధంగా జిల్లా కలెక్టర్‌కు లేఖ రాసి పరిస్థితిని వివరించినట్లు కూడా తెలుస్తోంది. అయితే ఆ లేఖకు, ఫిర్యాదులకు రెండేళ్లు గడిచినా స్పష్టమైన చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### ఓపెన్ స్పేస్ మిస్టరీకి ఇదే క్లూ?

లేఅవుట్ ఆమోద సమయంలో ఏ బ్లాక్‌లో ఓపెన్ స్పేస్‌గా చూపిన భూమి ప్రస్తుతం ఎక్కడ ఉంది? అన్న ప్రశ్న ఇప్పుడు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. "మ్యాప్‌లో ఓపెన్ స్పేస్... నేలపై అపార్ట్మెంట్లు?" అన్న చర్చ స్థానికుల్లో జోరుగా సాగుతోంది.

### స్థానికుల డిమాండ్లు ఇలా...

హెచ్‌ఎండీఏ భూముల అన్యాక్రాంతంపై స్థానికులు పలు డిమాండ్లను వెల్లడిస్తున్నారు. వెంటనే జాయింట్ సర్వే నిర్వహించాలని, తహశీల్దార్ లేఖ, వీడియోపై స్వతంత్ర విచారణ జరిపించాలని, ఆమోదిత లేఅవుట్ వివరాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఓపెన్ స్పేస్ స్థలాన్ని భౌతికంగా గుర్తించి రక్షణ కల్పించాలని, అక్రమ నిర్మాణాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### రెండేళ్లుగా నిశ్శబ్దమేనా?

హెచ్‌ఎండీఏ భూములపై అప్పటి తహశీల్దార్ అధికారులకు సమాచారం ఇచ్చి, కలెక్టర్‌కు లేఖ రాసినా చర్యలు ఎందుకు ఆలస్యమయ్యాయి? సంబంధిత శాఖలు ఎందుకు స్పందించలేదు? అన్న



ప్రశ్నలు ఇప్పుడు ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి. అంతేగాకుండా తెల్లాపూర్ ఏ బ్లాక్‌లో భూమి మొత్తం ఎంత ఉంది?, అందులో ఓపెన్ స్పేస్‌గా కేటాయించిన స్థలం ఎంత? అనేది తేల్చాల్సి ఉంది. ఎంక్రోచ్మెంట్ జరిగిందని తహశీల్దార్ పేర్కొన్న భూమి ఇదేనా? ఇందుకు బాధ్యులెవరు? చర్యలు ఎప్పుడు తీసుకుంటారో అనేది ప్రశ్నార్థకంగా మారింది. తెల్లాపూర్ ఏ బ్లాక్ భూముల వ్యవహారం ఇప్పుడు అధికారులకు సవాలుగా మారింది. తహశీల్దార్ వీడియో వైరల్ కావడంతో విచారణ వేగవంతం అవుతుందా? లేక మళ్లీ ఫైళ్లకే పరిమితమవుతుందా? అన్నది వేచిచూడాలి.

**(ఈ వివాదంపై మరిన్ని సంచలన వివరాలు తదుపరి కథనంలో...)**













# కో ఆప్షన్ పదవిపై కంది ప్రభాకర్ అసంతృప్తి!?

## పార్టీకి ఎనలేని సేవలందిస్తే గుర్తింపు లేదా ?

- బీజేపీ పెద్దల హామీ నీటిమూటేనా ?
- పార్టీ వ్యవహారంపై ప్రభాకర్ తీవ్ర నిరాశ
- కో ఆప్షన్ కంది బబితకు ఇవ్వాలని కార్యకర్తల డిమాండ్







**నర్సాపూర్, మార్చి 1(సిరిన్యూస్):** భారతీయ జనతా పార్టీకి ఎనలేని సేవలందించినప్పటికీ పార్టీ పెద్దలు ఇచ్చిన హామీ మేరకు నర్సాపూర్ మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్‌గా తమ కుటుంబానికి కేటాయించడం లేదని సీనియర్ నాయకుడు కంది ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్టీ వ్యవహార శైలిపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. కంది ప్రభాకర్ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ సమయంలో స్వర్గీయ ఎన్టీయార్ హయాంలో ఉమ్మడి మెదక్ జిల్లా యువత విభాగం అధ్యక్షునిగా కొనసాగారు. సంక్షోభం సమయంలో ఎన్టీయార్‌తో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయనతో పాటు పర్యటించారు. సంక్షోభం తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ మిత్రపక్షమైన కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా స్వర్గీయ సిహెచ్.విఠల్‌రెడ్డికి టికెట్టు రావడంతో అతనిపై రెబల్ టీడీపీ అభ్యర్థిగా ప్రభాకర్ పోటీ చేయడం జరిగింది. తదనంతరం నర్సాపూర్ లక్ష్మీనర్సింహ్మా స్వామి ఆలయం ట్రస్టు చైర్మన్‌గా ఎంపికయ్యారు. ఆ సమయంలో ఆలయ భూములు వంద ఎకరాలను రెవెన్యూ, కాస్రా రికార్డుల్లో ఎక్కించి దేవాదాయ శాఖకు చెందేలా చర్యలు తీసుకున్నారు. ప్రభాకర్ సేవలను గుర్తించిన టీడీపి తిరిగి పార్టీలోకి ఆహ్వానించి టీటీడీ బోర్డు మెంబర్‌గా నియమించింది. తదనంతరం జరిగిన పరిణామాల వల్ల టీడీపీ, బిజేపీ పొత్తు కుదరడంతో పూర్తిస్థాయిలో బీజేపీలో క్రియాశీలకంగా పనిచేశారు. 2013లో జరిగిన నర్సాపూర్ గ్రామ పంచాయతీ ఎన్నకల్లో 13వ వార్డును మహిళకు కేటాయించడంతో ప్రభాకర్ సతీమణి కంది బబిత పోటీ చేసి విజయం సాధించారు. తర్వాత వార్డులో ప్రభుత్వ బాలుర, బాలికల పాఠశాల ఏర్పాటుకు తీవ్ర కృషి చేశారు. అలాగే సీసీ రోడ్లు, పారిశుద్ధ్య కార్యక్రమాలను చేసి వార్డును అభివృద్ధి చేశారు. 2014లో జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన సంగసాని సురేశ్‌ను గెలిపించడంతో ముఖ్యపాత్ర పోషించారు. 2013 నుంచి 2018 వరకు కంది ప్రభాకర్ ప్రత్యేక గుర్తింపును పొందారు. 2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థి సంగసాని సురేశ్‌ను కౌన్సిలర్‌గా గెలిపించడం జరిగింది. 2026లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 5వ వార్డు బీసీ మహిళకు కేటాయించడంతో బీజేపీ టికెట్టు ఆశించిన కంది బబితకు పార్టీ పెద్దలు, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, మురళీ యాదవ్ ఆదేశాల మేరకు సంగసాని సురేశ్ సతీమణి మంజులకు ఇవ్వడం జరిగింది. ఇందుకు గాను కంది బబితకు కో ఆప్షన్ మెంబర్ పదవి ఇస్తామని హామీనిచ్చారు. అయితే ఈ ఎన్నికల్లో 5వ వార్డు నుండి సంగసాని మంజుల ఓటమి చెందడంతో కంది బబితకు హామీనిచ్చిన కో ఆప్షన్ మెంబర్ పదవిపై స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో కంది ప్రభాకర్ వర్గీయులు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. త్వరలోనే కో ఆప్షన్ పదవి ఇస్తారని ఆశిస్తున్నప్పటికీ పార్టీ పెద్దల నుండి ఎలాంటి స్పష్టత రాకపోవడంతో కంది ప్రభాకర్ తీవ్ర అసంతృప్తికి గురవుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ కోసం పలుమార్లు కష్టపడి అభ్యర్థులను గెలిపించిన నేపథ్యంలో పార్టీ పెద్దల హామీ మేరకు కో ఆప్షన్ సభ్యునిగా కంది బబితకు ఇవ్వాలని ప్రభాకర్ కోరుతున్నారు.



# ఈ పాపం ఎవరిది !?

## రెగ్యులర్ డీపీవో లేక పంచాయతీ పాలన అస్తవ్యస్థం

**కలెక్టరమ్మా.. కనికరించమ్మా!**



- అధికారుల నిర్లక్ష్యానికి కార్యదర్శి కుటుంబం బలి
- ఆ కుటుంబానికి దిక్కెవరు ?
- కలెక్టర్ వద్ద ఆగిపోయిన రెగ్యులరైజ్ ఫైల్
- రెగ్యులర్ కాలేక వందలాది జూనియర్ కార్యదర్శుల ఎదురుచూపులు

**సంగారెడ్డి జిల్లా పంచాయతీ కార్యాలయంలో డీపీవో పోస్టు ఖాళీగా ఉండడంతో పంచాయతీల పాలన అస్తవ్యస్థంగా మారింది. నెలల తరబడి ఇదే తంతు కొనసాగుతున్నా జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారుల నుండి స్పందన రావడం లేదు. అధికారుల నిర్లక్ష్యానికి ఓ కుటుంబం వీధినపడింది. ఆరేళ్ళుగా రెగ్యులర్ ఉత్తర్వులు అందక పంచాయతీ జూనియర్ కార్యదర్శులు కళ్ళుకాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. మరోవైపు ఇతర జిల్లాల్లో రెగ్యులర్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయినప్పటికీ కేవలం సంగారెడ్డి జిల్లాలో మాత్రం ఉన్నతాధికారుల నిర్లక్ష్యం వల్లనే అష్టకష్టాలు పడుతున్నారు. మరోవైపు జూనియర్ పంచాయతీలు నాలుగేళ్ళ ప్రొహిబిషన్ కాలం పూర్తి చేయగానే రెగ్యులరైజ్ చేయాలని పంచాయతీరాజ్ కమిషనర్ నుండి ఆదేశాలు రావడంతో గత డీపీవో జాబితా తయారు చేసి కలెక్టర్‌కు పంపించారు. అయినప్పటికీ ఆ ఫైల్ కలెక్టర్ చాంబర్‌లోనే ఏళ్ళ తరబడి మూలుగుతుంది. రెగ్యులర్ ఉత్తర్వులు రాకపోవడంతో సిర్గాపూర్ మండలానికి చెందిన కార్యదర్శి అనారోగ్యంతో మృతి చెందగా అతని కుటుంబానికి దక్కాల్సిన రాయితీలు, ఉద్యోగం రాకుండా పోయాయి. ఈ విషయాన్ని సిరి దినపత్రిక కథనాన్ని ప్రచురించింది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని కార్యదర్శులు కోరుతున్నారు.**

(ప్రత్యేక ప్రతినిధి-సిరిన్యూస్) జిల్లా పంచాయతీ కార్యాలయంలో గత డీపీవో సాయిబాబా బదిలీపై వెళ్ళిన తర్వాత ఇప్పటి వరకు రెగ్యులర్ డీపీవోను నియమించక పోవడంతో పంచాయతీ పాలన గాడితప్పింది. రెగ్యులర్ డీపీవోను నియమించక పోవడంతో ఇంచార్జిగా జడ్పీ సీఈవోకు అదనపు బాధ్యతలు అప్పగించారు. జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో జూనియర్ కార్యదర్శులు ఆరేళ్ళ నుండి విధులు నిర్వహిస్తున్నా వారికి ఇప్పటి వరకు రెగ్యులర్ ఉత్తర్వులు అందలేదు. వీరంతా 2019 ఏప్రిల్‌లో ఉద్యోగాలు పొందారు. అప్పటి నుండి 2023 వరకు నాలుగేళ్ళ ప్రొహిబిషన్ సర్వీసు పూర్తి చేసుకున్నారు. మరుసటి రోజునుండే వారిని రెగ్యులరైజ్ చేయాల్సి ఉండగా అదనంగా రెండేళ్ళు పూర్తి చేసినా ఇంకా ఉత్తర్వులు రాలేదు. అయితే వారికి సంబంధించిన ఫైల్‌ను డీపీవో ద్వారా కలెక్టర్‌కు అందించారు. గత డీపీవో సాయిబాబా పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు రెగ్యులర్ కావాల్సిన జూనియర్ కార్యదర్శుల జాబితాను కలెక్టర్ కు అందించారు. ఇక అప్పటి నుండి ఆ ఫైల్ కలెక్టర్ చాంబర్‌లోనే ఉండిపోయింది. బదిలీ తర్వాత ఇంచార్జిగా జడ్పీ సీఈవో బాధ్యతలు చేపట్టిన రెగ్యులర్ ఉత్తర్వుల విషయంలో ఫైల్ ముందుకు కదలలేదు. దీంతో వారికి ఎదురుచూపులే మిగిలాయి. ఇలా జిల్లాలో సుమారు 400 పైచిలుకు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు రెగ్యులరైజేషన్ కోసం ఎదురుచూస్తున్నారు. కార్యదర్శి రాజశేఖర్‌లాగే మరో కార్యదర్శికి అన్యాయం జరగకముందే ఇప్పటికైనా కలెక్టర్ వెంటనే స్పందించి రెగ్యులరైజ్ ఫైల్‌ను పంచాయతీరాజ్ కమిషనర్‌కు పంపించాలని కోరుతున్నారు. గతంలో ఎంపీడీవోలు సైతం రెగ్యులరైజ్ చేయాలని సూచించినా అది కూడా ముందుకు కదలలేదు.

### రాజశేఖర్ కు అన్యాయం అధికారులు పాపమే...

ఓవైపు జిల్లా పంచాయతీ అధికారి లేకపోవడం, ఇంచార్జి పాలనతో గాడితప్పడంతో సిర్గాపూర్ మండలం పోచాపూర్ గ్రామ పంచాయతీ జూనియర్ పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ అనారోగ్యంతో మృతి చెందాడు. అయితే అధికారుల నిర్లక్ష్యం వల్ల అతనికి రెగ్యులర్ కాకపోవడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. ఒకవేళ రెగ్యులర్ అయివుంటే ప్రభుత్వ పరంగా రావాల్సిన రాయితీలు, ఆ కుటుంబంలో ఉద్యోగం లభించేది. అదనంగా రెండేళ్ళపాటు ఉద్యోగం చేసినా రెగ్యులర్ ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో రాజశేఖర్‌కు తీరని అన్యాయం జరిగింది. ఈ పాపానికి కారకులెవరు ? అధికారులు కారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ ఘటన జరిగినప్పటికీ జిల్లా కలెక్టర్ సైతం స్పందించక పోవడం శోచనీయం.

# ఏడుపాయల ఆలయం మూసివేత


- **మార్చి 2న అమ్మవారి పల్లఖీ సేవ**
- **ఆలయ ఈఓ వీరేశం**

**పాపన్నపేట మార్చి1,(సిరిన్యూస్):** చంద్రగ్రహణం సందర్భంగా మార్చి 3 మంగళవారం ఉదయం 6:00 గంటల ఆలయం పూర్తిగా మూసివేయనున్నట్లు ఏడుపాయల ఆలయ ఈఓ ఎం వీరేశం తెలిపారు. మంగళవారం ఉదయం మార్చి 3న ఉదయం 5:00 గంటలకు వనదుర్గాభవాని మాత అమ్మవారికి అభిషేకం, అలంకారము తదితర సేవలను నిర్వహించి ఉదయం 06:00 గంటల నుండి ఆలయాన్ని మూసి వేయబడుతుందని తెలిపారు. మరునాడు మార్చి 4 బుధవారం ఉదయము ఆలయాన్ని శుద్ధిచేసి, సంప్రోక్షణ కార్యక్రమాలు చేసిన తర్వాత అనంతరం అభిషేకము నిర్వహించిన ఉదయం 8:00 గంటల నుండి భక్తులకు తిరిగి అమ్మవారి దర్శనము కల్పిస్తామని ఈఓ వీరేశం తెలిపారు పౌర్ణమి సందర్భంగా అమ్మవారి పల్లకి సేవ మార్చి 2 న సోమవారము సాయంత్రం 6:00 గంటల ఎదావిధిగా నిర్వహించబడుతుందని ఈఓ వీరేశం వివరించారు.



# వనదుర్గమ్మను దర్శించుకున్న రాహుల్ రాజ్

**పాపన్నపేట మార్చి1(సిరిన్యూస్):** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ ఏడుపాయల వనదుర్గాభవానీ మాతను తెలంగాణ రాష్ట్ర రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్ కమీషనర్ రాహుల్ రాజ్ కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి వీరేశం, అర్చకులు ఆలయ మర్యాదలతో పూర్ణ కుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. వనదుర్గాదేవి ఆలయ గర్భాలయంలో అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చన, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అమ్మవారి అనుగ్రహాన్ని అందజేశారు. ఆలయ మర్యాదలతో రిజిస్ట్రార్, కమీషనర్ రాహుల్ రాజ్ దంపతులను ఆలయ ఈఓ వీరేశం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాహుల్ రాజ్ మాట్లాడుతూ మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గ భవాని అమ్మవారి ఆలయం ఎంతో చారిత్రాత్మక ఆలయంగా ప్రసిద్ధికెక్కిందని, భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి దర్శనానికి విచ్చేస్తారని పేర్కొన్నారు. భక్తుల కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారంగా విరాజిల్లుతుందని, అత్యంత మహిమాన్విత క్షేత్రం ఏడుపాయల అన్నారు. వనదుర్గా భవాని అమ్మవారి ఆశీస్సులతో జిల్లాలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కమిషనర్ రాహుల్ రాజ్ ఆకాంక్షించారు. మహాశివరాత్రి సందర్భంగా జరిగిన ఏడు పాయల జాతరను ప్రశాంతంగా పూర్తిస్థాయిలో విజయవంతం చేశామన్నారు. లక్షలాది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాతర విజయవంతానికి సమిష్టి కృషి, సమన్వయంతో అత్యంత చురుకుగా పనిచేసిన జిల్లాలోని వివిధ శాఖల అధికారులకు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా కు రాహుల్ రాజ్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు



# ఓటమిని జీర్ణించుకోలేక డ్రామాలాడుతున్నారు

- ప్రజల దృష్టి మళ్లీంచేందుకే కాంగ్రెస్ పై బిఆర్ఎస్ ఆరోపణలు
- అధికారంలో ఉండగా ప్రజలకు చేసిందేమిలేదు
- ఎమ్మెల్యే ను విమర్శిస్తే సహించేదిలేదు
- ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతుంది కాంగ్రెస్ పార్టీ
- మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్




**మెదక్ ప్రతినిధి,మార్చి01(సిరి న్యూస్)** మున్సిపల్ ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేక బిఆర్ఎస్ నేతలు డ్రామాలాడుతున్నారని మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ విమర్శించారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు.ప్రజల దృష్టి మళ్లీంచేందుకే కాంగ్రెస్ పై బిఆర్ఎస్ ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. అధికారంలో ఉండగా ప్రజలకు చేసిందేమి లేదన్నారు.నిత్యం మెదక్ అభివృద్ధి కోసం కాంక్షించే ఎమ్మెల్యే ను విమర్శిస్తే సహించేదిలేదని అయన హెచ్చరించారు. ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ పాటుపడుతుందన్నారు. వాస్తవాలు ప్రజల్లోకి వెళ్లడం లేదని, వాస్తవమేదో అవాస్తవమేదో ప్రజలకు చేరాల్సిన అవసరం ఉందని అన్నారు. అక్రమ అరెస్టులు దాడులు అంటున్నారని ఈరోజు జరుగుతున్న పరిణామాలన్ని ఓడిపోయిన వ్యక్తులు సింపతి పొందడానికే చేస్తున్న కుట్రలన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాత్రిపూట 15వ వార్డు లో పదుల సంఖ్యలో మల్లికార్జున్ గౌడ్ తన అనుచరులను పెట్టుకొని మా మద్దతుదారులైన ఓ మహిళ ఇంటి ముందు చేరి భయభ్రాంతులకు గురి చేశారనే సమాచారాన్ని అందుకున్న ఎమ్మెల్యే ఆమెను పరామర్శించేందుకు రావడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే అక్కడికి వచ్చింది డబ్బులు పంచేందుకు కాదని ఆయనకు డబ్బులు పంచాల్సిన అవసరం ఏముంటుందన్నారు. తనపై దాడి జరిగిన రాత్రి ఏం జరిగిందనే వాస్తవాన్ని ప్రజలకు ఎందుకు తీసుకెళ్లలేకపోతున్నారని ఆయన ప్రశ్నించారు. ఎమ్మెల్యే పై దాడి జరిగిన రాత్రి మల్లికార్జున్ గౌడ్ తన అనుచరులను గుంపులు గుంపులుగా ఏర్పాటు చేసి ఎవరు వస్తే వారిపై దాడులు చేసేందుకు సిద్ధమయ్యారని, సిద్దిపేటలో హరీష్ రావు వేసిన స్కెచ్ ను ఇక్కడ అమలు చేశారన్నారు. నాపై గొడ్డలి తీసుకుని భయభ్రాంతులకు గురి చేసి చంపేకుట్ర చేశారన్నారు. దాడి చేసిన వారిపై ఎలాంటి పిర్యాదు చేయలేదని మీరే ఫోటోలు, వీడియోలు తీసి మీరే కదా ఫోన్ ద్వారా షేర్ చేసిందన్నారు.ఎమ్మెల్యే వాహనం పై, తన పై దాడులు జరిగిన విషయం వాస్తవం కాదా అవి మీకెందుకు కళ్లకు కనబడడం లేదన్నారు. ఆరోజు జరిగిన దాడిపై ఎక్కడ స్పందించకూడదని దీనికి ప్రజలే సరైన సమాధానం చెబుతున్నారని దానికి అనుగుణంగానే ప్రజలు మంచి మెజారిటీతో గెలిపించారన్నారు. మీరు సోషల్ మీడియాలో వైరల్ చేసిన వీడియోలో చాలా మంది ఉన్నారని మేము ఏ ఒక్కరిపై కూడా ఫిర్యాదు చేయలేదన్నారు. మీరు ప్రోత్సహిస్తే నాపై దాడులకు పాల్పడ్డ వ్యక్తులు లోపల ఉంటారు ఎట్లా, మీరు బయట ఉంటారు ఎట్లా అని, వారికి బెయిల్ ఎందుకు రాలేదు మీకు బెయిల్ ఎలా వచ్చిందని ఆయన ప్రశ్నించారు. జైల్లో ఉన్న వారి కుటుంబ సభ్యుల సింపతి పొందేందుకే ఇలాంటి డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని పట్టణానికి కావాల్సిన నిధులను సైతం తీసుకు వస్తున్నారని ఇవన్నీ చూసి ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారన్నారు. మెదక్ నియోజకవర్గం లోని మెదక్, రామయంపేట్ మున్సిపాలిటీలోనూ కాంగ్రెస్ జెండా ఎగరడానికి ఎమ్మెల్యే రోహిత్ రావు, మైనంపల్లి హనుమంతరావు లు ఎంతో శ్రమించారన్నారు . ఇక మీదట కాంగ్రెస్ పార్టీ, ఎమ్మెల్యే రోహిత్ రావ్ మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు లపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లయితే సహించేది లేదన్నారు. ప్రజా శ్రేయస్సు కోసం మీరు పని చేసినట్లయితే మీకు మరోసారి ప్రజలు పట్టం కట్టే వారిని మీరు మీ కుటుంబ సభ్యులు బంధువులను మాత్రమే ప్రోత్సహించుకున్నారని ఆరోపించారు. మీ అంతటా మీరే బయటికి వచ్చి హైడ్రామా చేస్తారని, లోపలికి వెళ్లి నవ్వుకుంటురని, దీంతో ఎవరి తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. ఇప్పటి నుండి తమ పై ఎలాంటి అసత్య ఆరోపణలు చేసిన, దాడులకు తెగబడిన దాడులకు ప్రతి దాడులు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తోడుపునూరి చంద్రపాల్, కౌన్సిలర్లు గంట సంపత్, హరిత, మన్సూర్, శశాంక్, పట్టణ అధ్యక్షుడు మందుగుల గంగాధర్, నాయకులు రాగి అశోక్, మ్యాడమ్ బాలకృష్ణ, మేడి మధుసూదన్ రావు, లక్ష్మీనారాయణ, గోదా సాయి,పాల సిద్దిరాములు తదితరులు పాల్గొన్నారు.

# ఆనందాల రంగుల కేళి – హోలీ

- పకృతి సంపాదించిన రంగుల రాగం హోలీ పండుగ
- రసాయనలతో కూడిన రంగులు వద్దు
- రంగు రంగు హోలీతో జాగ్రత్త సుమా
- సహజ సిద్ధమైన రంగులనే వాడుదాం
- ఆనందోత్సవాల మధ్య రంగుల పండుగ జరుపుకుందాం

**గుమ్మడిదల, సిరి న్యూస్ :** పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా జరుపుకునే రంగుల పండుగ హోలీ. ఈ నెల 3 వ తేదీన పల్గుణ పౌర్ణమి సందర్భంగా ఘనంగా జరుపుకోవాలని సిద్ధంగా ఉన్నారు. హోలీని కాముని పూర్ణమి, కామదహనం, వసంతోత్సవం, మదినోత్సవం వంటి పేర్లతో కూడా పిలుస్తారు. రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడపడం ఈ పండుగ ప్రత్యేకత. ఒకప్పుడు అడవుల్లో లభించే పూలతో తయారు చేసిన సహజ రంగులనే హోలీలో వాడేవారు. కానీ కాలక్రమేణా రసాయనాలతో కూడిన రంగులు మార్కెట్ను ఆక్రమించాయి. ఆకర్షణీయమైన కలర్స్ కోసం కెమికల్ రంగుల వైపు యువత ఎక్కువగా మొగ్గు చూపుతోంది. వైద్యుల హెచ్చరికల ప్రకారం, ఈ రసాయన రంగులు చర్మ ఎలర్జీలు, కంటి సమస్యలు, వెంట్రుకలు ఊడిపోవడం వంటి అనారోగ్య సమస్యలకు దారి తీస్తున్నాయి. పర్యావరణానికీ హానికరంగా మారుతున్నాయి.



## రసాయనాలతో కూడిన రంగులు వద్దు

ప్రస్తుతం మార్కెట్లో లభించే హోలీ రంగుల్లో అనేక రకాల రసాయనాలు కలుస్తున్నాయి. ముఖ్యంగా పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అందువల్ల సహజ సిద్ధమైన రంగులనే వినియోగించాలని పలువురు సూచిస్తున్నారు.

## తీసుకోవలసిన జాగ్రత్తలు

సహజ సిద్ధమైన రంగుల వాడకానికి ప్రాధాన్యత ఇవ్వాలి.

రంగులు పూసుకునే ముందు ముఖం, చేతులు, జుట్టుకు నూనె రాసుకోవాలి.

రంగులు పూసుకున్న వెంటనే పదే పదే కడగకూడదు.

జుట్టు రక్షణకు టోపీ ధరించాలి.

చల్లని నీటితో మాత్రమే స్నానం చేయాలి.

కళ్లకు రంగు పడకుండా జాగ్రత్తగా ఉండాలి.

పూర్తిగా కవర్ అయ్యే దుస్తులు ధరించాలి.



గ్రీస్, కందెన వంటి పదార్థాలు వాడరాదు.

మద్యం సేవించి హోలీ ఆడకూడదు.

గాజు సీసాల బదులు పిచికారీలు వాడాలి.

మహిళలు ఆభరణాల విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

## దుకాణాల్లో సిద్ధంగా ఉన్న రంగులు

హోలీ పండుగను పురస్కరించుకుని దుకాణాల్లో పలు రకాల రంగులు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. కానీ వాటిలో రసాయనాలు ఉండే అవకాశమున్నందున కొనుగోలు చేసే ముందు జాగ్రత్తగా పరిశీలించాలి. లేకపోతే ప్రమాదాన్ని కొని తెచ్చుకున్నట్టే అవుతుంది.

## రంగులు – ఎన్నో భావాలు

వైలెట్ – ఆనందాన్ని, సానుకూల దృక్పథాన్ని పెంచుతుంది.

నీలం – విజ్ఞానం, ప్రశాంతతను ప్రేరేపిస్తుంది.

ఆకుపచ్చ – ప్రేమ, ఆసక్తిని పెంపొందిస్తుంది.

పసుపు – మానసిక ఉల్లాసం అందిస్తుంది.

కాషాయం – పవిత్రతకు ప్రతీక.

ఎరుపు – శక్తి, ధైర్యానికి సూచకం.

ఈ సప్తవర్ణాలు మన జీవితాన్ని ఆనందమయం చేస్తాయని భావిస్తారు.

# ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

- సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో యధావిధిగా ప్రజావాణి
- మెదక్ కలెక్టర్ ప్రతిమాసింగ్

**మెదక్ మార్చి01(సిరిన్యూస్)** ప్రతి సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో యధావిధిగా ప్రజావాణి కొనసాగుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజావాణిపై కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార దిశగా ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు జిల్లా అధికారులందరూ సమయపాలనతో తప్పనిసరిగా ప్రజావాణికి హాజరుకావాలని ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు.



# విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో ఉత్తమ మహిళా పురస్కారాలు



- ఘనంగా వనిత నీకు వందనం కార్యక్రమం
- కీర్తిశేషులు ఆర్ విజయ లక్ష్మి జ్ఞాపకార్థం మహిళా పురస్కారాలు

**గజ్వేల్ : ఫిబ్రవరి 01 (సిరి న్యూస్)** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రముఖ రచయిత స్వరకర్త గాయకుడు విశ్వేశ్వర రావు కుటుంబ సభ్యుల సహకారంతో వారి మాతృమూర్తి కీర్తిశేషులు విజయలక్ష్మి జ్ఞాపకార్థం ఆదివారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలకు పురస్కారాలు అందజేశారు, పురస్కార గ్రహీతలు తునికి ఉమారాణి విద్య, డాక్టర్ దుబకుంట మంజుల, పెండ్యాల భార్గవి మహేష్, కొత్త ముక్తా భాయ్, సుధారాణి కృష్ణంరాజు, షేర్ల నాగలక్ష్మి ఇలా ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆరుగురు మహిళలతో పాటు పలువురికి సత్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా శ్రీవాణి రోహిత్ వ్యవహరించగా ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, కళా రత్న అవార్డు గ్రహీత శంకర్ నారాయణ, విశిష్ట అతిథులుగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్ వైస్ చైర్మన్ కళ్యాణ్ కార్ పద్మ భాయ్ నర్సింగరావు మాజీ చైర్మన్ రాజమౌళి గౌరవ అతిథులుగా 20 వార్డ్ కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ గోపాల్ రెడ్డి, వారి ఆత్మీయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ యాదవ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో మహిళల పాత్ర గొప్పదని వారు అన్ని రంగాల్లో ముందుకు దూసుకెళ్తున్నారని గజ్వేల్ లో సాహిత్య సాంస్కృతి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న విశ్వేశ్వర రావును అభినందించారు. కళారత్నా శంకర్ నారాయణ మాట్లాడుతూ అమ్మ యొక్క గొప్పతనాన్ని వివరించారు. మహిళా లేనిదే మనిషికి మనుగడ లేదని సమాజ శ్రేయస్సులో మహిళల పాత్ర ముఖ్యమైనదని అన్నారు. విశ్వేశ్వరరావు మంజుల మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతూ ప్రతి సంవత్సరం ఇలాగే ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, అమ్మకు వందనం అని అమ్మ లేనిదే మన జీవితం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ సంజయ్ గుప్తా, లయన్ నేతి శ్రీనివాస్, లయన్స్ క్లబ్ సభ్యులు, వసంత, అరుణ, రాజేశ్వర్ దివాకర్ రావు, శ్రీనివాస్ రావు మధుసూదన్ రావు రోహిత్ రవీందర్ నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్




**సిద్దిపేట మార్చి 1(సిరి న్యూస్) :** సిద్దిపేట జిల్లా కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి ఆలయాన్ని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దర్శించుకున్నారు. ఈ మేరకు కుటుంబ సమేతంగా స్వామివారికి బోనం,పట్నం సమర్పించి మంత్రి పొన్నం ప్రభాకర్ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. మల్లికార్జున స్వామి వారి ఆశీస్సులతో రాష్ట్రమంతా సమృద్ధి వర్షాలతో పాడి పంటలతో ప్రజలంతా ఆయు ఆరోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ప్రజా పాలన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు , అభివృద్ధి కార్యక్రమాలు అవరోధాలు లేకుండా చూడాలని స్వామివారిని వేసుకున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. భారతదేశ భవిష్యత్ నిర్మాణంలో తెలంగాణ నిర్మాణం ఉంటుందని.. విద్య విషయంలో రాజకీయం చేయవద్దని కోరుతున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీగా విద్యా కమిషన్ ఇచ్చిన రిపోర్ట్ లో ఏమైనా పొరపాటు ఉంటే సవరిస్తూ సూచనలు చేయాలని సూచించారు. గత ప్రభుత్వం లో మీరు ఏదైనా కార్యక్రమం చేసినట్టయితే తెలంగాణ విద్యా విధానం బాగుపడింది అంటే మీ అంశాలు స్వీకరిస్తామన్నారు. విద్యా కమిషన్ రిపోర్ట్ లో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని చెప్పడాన్ని తాను స్వాగతిస్తున్నానన్నారు. రాబోయే క్యాబినెట్ లో ముఖ్యమంత్రికి ఇతర మంత్రులకు వివరించి విద్యార్థి సంఘ నాయకుడిగా యూనివర్సిటీ మాదిరిగా ఎన్నికల సంఘాల ఎన్నికలు నిర్వహించేలా చర్యలు చేపడుతామన్నారు. గతంలో అనేక సార్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయాయని, వచ్చే విద్యా సంవత్సరం నుండి ఎన్నికలు జరిగే విధంగా వచ్చే క్యాబినెట్ లో నిర్ణయం తీసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు.

# నూతన కౌన్సిలర్లకు సన్మానం



**రామాయంపేట, మార్చి 1 (సిరి న్యూస్ )** ప్రజల సహకారంతో రామాయంపేట మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన పాలకవర్గం సభ్యులు తెలిపారు.. మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపల్ నూతన పాలకవర్గం సభ్యులను సన్మానించారు. ఆదివారం వంజరి సంఘం సభ్యులు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ ఏడో వార్డు కౌన్సిలర్ గజవాడ నాగరాజు, ఎనిమిదవ వార్డ్ కౌన్సిలర్ జంగంపల్లి శంకర్ గౌడ్ లను వంజరి సంఘం పట్టణ అధ్యక్షులు నవాత్ శ్రీనివాస్ శాలువాలతో ఘనంగా సన్మానించారు.. ఈ కార్యక్రమంలో వంజరి సంఘం సభ్యులు పటేల్ రవీందర్, నవాత్ ప్రభాకర్ నవాత్ మహేష్, నవాత్ ప్రసాద్, జుంగే సత్యం, పటేరి రాము, నవాత్ నవిన్, కాలేరు ప్రసాద్, సరిదే వెంకటేశం, కాలేరు హరికిషన్, కాలేరు రంజిత్, అముద సత్యం, అముద నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# వేసవి కాలంలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపడతాం

- రెండు చోట్ల బోర్ల తవ్వకాలు
- అక్కన్నపేట గ్రామ సర్పంచ్ బక్కయ్య గారి యాదగిరి




**రామాయంపేట, మార్చి 1 (సిరి న్యూస్ )** ఈ వేసవి కాలంలో నీటి ఎద్దడి నివారణ కోసం గ్రామంలో రెండు చోట్ల బోర్ల తవ్వకాలు వేసి సాధ్యమైనంత మేరకు నీటి ఎద్దడి లేకుండా కృషి చేస్తామని రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామ సర్పంచ్ బక్కయ్య గారి యాదగిరి తెలిపారు గ్రామంలో నెలకొన్న నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు చేపడుతున్నట్లు మెదక్ జిల్లా రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామ సర్పంచ్ బక్కయ్య గారి యాదగిరి తెలిపారు. వేసవి కాలంలో భూగర్భ జలాల మట్టం పడిపోవడంతో తాగునీటి కొరత మరింత పెరిగిందని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా కొత్త బోర్లు వేయిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గ్రామంలోని పలు వార్డుల్లో తాగునీటి సమస్య ఉందని గుర్తించి, అవసరమైన ప్రదేశాల్లో బోర్ల త్రవ్వకాలు వేగవంతం చేస్తున్నామని చెప్పారు. ఆదివారం నాడు గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ముందు నూతనంగా బొరు వేశారు. తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా ప్రత్యేక పర్యవేక్షణ కూడా చేపడుతున్నామని పేర్కొన్నారు. గ్రామంలో కోతుల బెడద పెరిగిన విషయాన్ని కూడా సర్పంచ్ ప్రస్తావించారు. ఇళ్లలోకి చొరబడి ఆహారం, పంటలకు నష్టం కలిగిస్తున్న కోతులను ప్రత్యేక బృందాల ద్వారా పట్టుకునే చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నీటి సమస్యల పరిష్కారం, పారిశుధ్యం, రహదారుల మెరుగుదల వంటి అంశాల్లో ప్రజల సహకారం అవసరం. అందరూ కలిసి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దాం" అని సర్పంచ్ బక్కయ్య యాదగిరి పిలుపునిచ్చారు. గ్రామస్తులు కూడా బోర్ల త్రవ్వకాల నిర్ణయాన్ని స్వాగతిస్తూ, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ NM ప్రసాద్, నాయకులు శ్రీకాంత్, సురేందర్,వెంకటేష్ గౌడ్,స్వామి, శశిధర్, శ్రవణ్ గౌడ్ తదితరులు ఉన్నారు.

# చేగుంటలో భార్య హత్య, నిందితుడి అరెస్ట్

- డబ్బుల కోసం భార్యను పారతో కొట్టి హత్య
- రామాయంపేట సీఐ వెంకట రాజా గౌడ్




**రామాయంపేట, మార్చి 1 (సిరి న్యూస్ )** డబ్బుల కోసం భార్యను పారతో కొట్టి హత్య చేసిన కేసును రామాయంపేట పోలీసులు దాకచక్యంగా ఛేదించారు. ఈ మేరకు నిర్వహించిన మీడియా సమావేశంలో రామాయంపేట సీఐ వెంకట రాజా గౌడ్ కేసు వివరాలను వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... 2015 సంవత్సరంలో మృతురాలు వరలక్ష్మి, నిందితుడు ముఠా త్రిమూర్తులకు రెండో వివాహం జరిగింది. వివాహానంతరం నిందితుడు ఇల్లరికం వచ్చి చేగుంటలో నివాసం ఉంటూ వచ్చాడు. వీరికి దుర్గాప్రసాద్ (10) అనే కుమారుడు ఉన్నాడు. రెండు సంవత్సరాల క్రితం కుటుంబ పోషణ కోసం వరలక్ష్మి కాళ్ళకల్ ఐటిసి కంపెనీలో ఉద్యోగానికి వెళ్లడం ప్రారంభించింది. ఈ నేపథ్యంలో నిందితుడు ఎలాంటి పని చేయకుండా ఇంట్లోనే ఉంటూ భార్యను డబ్బుల కోసం వేధించేవాడు. తరచూ జరిగే గొడవలతో భార్యపై ద్వేషం పెంచుకున్న నిందితుడు ఆమెను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. తేదీ 21.02.2026 అర్ధరాత్రి భార్య, కుమారుడు నిద్రిస్తున్న సమయంలో ఇంట్లో ఉన్న పరతో వరలక్ష్మి తలపై దాడి చేయగా ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం మృతురాలి వద్ద ఉన్న 39.55 గ్రాముల బంగారు పుస్తెలతాడు, రూ.5,000 నగదు, సెల్ ఫోన్ తీసుకుని అన్నవరం పారిపోయాడు. నమ్మదగిన సమాచారం మేరకు రామాయంపేట సీఐ వెంకట రాజా గౌడ్ నేతృత్వంలో ప్రత్యేక బృందం నిఘా ఏర్పాటు చేసి, 01.03.2026 ఉదయం చేగుంట బస్టాండ్ వద్ద నిందితుడిని అరెస్ట్ చేసింది. అతని వద్ద నుంచి బంగారు పుస్తెలతాడు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును ఛేదించిన రామాయంపేట్ సీఐ వెంకట రాజా గౌడ్, తూప్రాన్ సీఐ రంగకృష్ణ, చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్ రెడ్డి, ఎస్ఐ భిక్యా నాయక్, కానిస్టేబుళ్లు భాస్కర్, రాజశేఖర్, సాజిద్ అలీ, హోంగార్డ్ రవీందర్‌లను మెదక్ జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు అభినందించారు.

# రైతు బలోపేతమే గ్రామీణాభివృద్ధికి బాట


▪ మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్



**గుమ్మడిదల, మార్చి 1 (సిరి న్యూస్):** రైతు బలోపేతమే గ్రామీణాభివృద్ధికి బాటలు వేస్తామని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ తెలిపారు. గుమ్మడిదల మున్సిపాలిటీలో నూతనంగా ఎన్నికైన చైర్మన్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ సంధ్య గోవర్ధన్ రెడ్డి మరియు కౌన్సిలర్లు మాధవి, ప్రమీల, రమేష్, నరేందర్ రెడ్డి, చక్రపాణిలకు రైతు సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు. రైతు సంఘం అధ్యక్షుడు అమ్మగారి సదానంద రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నూతన ప్రజాప్రతినిధులకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, రైతుల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. సాగునీటి సమస్యలు, పంటల కొనుగోలు, ఎరువుల సరఫరా వంటి అంశాలను సమీక్షించి తక్షణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. వైస్ చైర్మన్ సంధ్య గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ రైతుల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణలో రైతుల సూచనలు కీలకమని తెలిపారు. రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు రైతుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు లబ్దిదారులకు చేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమం అనంతరం నాయకులు, రైతులు పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, రైతు సంఘం నాయకులు, పడమటి లక్ష్మారెడ్డి, పోచుగారి మోహన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ఆనంద్, రంగారెడ్డి, ఆకుల నర్సింలు, రవీందర్ రెడ్డి, మొగులయ్య, జయపాల్ రెడ్డి, రాములు, సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# యూనియన్ సభ్యులంతా కలిసికట్టుగా పనిచేయాలి

▪ మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్



**గుమ్మడిదల మార్చి 1(సిరి న్యూస్):** సమిష్టి కృషితో కలిసికట్టుగా పనిచేస్తే యూనియన్లు ప్రతిష్ఠంగా ఉంటాయని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ అన్నారు. ఆదివారం గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలో నూతనంగా ట్రాక్టర్ యూనియన్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు సంగం కుమార్ ఆధ్వర్యంలో ట్రాక్టర్ రావద్ద కొబ్బరికాయ కొట్టి యూనియన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ సమిష్టి కృషితో కలిసికట్టుగా పనిచేసి యూనియన్ కు మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు. యూనియన్ లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అందరూ ఏకాభిప్రాయంతో ముందుకు పోవాలని సూచించారు. వ్యక్తిగత స్వార్ధ ప్రయోజనాల కోసం సంఘాన్ని ముందుకు తీసుకుపోయి విడిపోయే స్థాయికి తీసుకురావద్దని సూచించారు. విడగొట్టాలని ప్రయత్నం చాలామంది చేయడానికి ప్రయత్నిస్తారు కానీ యూనియన్ లో ప్రతి ఒక్కరు బాగుపడే విధంగా ముందుకు పోవాలని ఆయన తెలిపారు. యూనియన్ లో ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులుగా ముందుకు పోవాలని ఆయన సూచించారు. వాహనాలు నడిపే ప్రతి డ్రైవర్ కు కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు ఇన్సూరెన్స్ నమోదు చేసుకొని ఉండవలెనని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్య గోవర్ధన్ రెడ్డి, కౌన్సిలర్లు మూడుచింతల నరేందర్ రెడ్డి, కత్తుల రమేష్, సురభి కుమార్ గౌడ్, చక్రపాణి, సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, యువ నాయకులు పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, శేఖర్ రెడ్డి, యూనియన్ నాయకులు సప్పటి భాస్కర్, కాశ బోయిన అంజనేయులు, మద్దేటి మల్లేష్ యాదవ్, ఎల్లయ్య, జిన్న మహేష్, భాస్కర్, కోటయ్య, కొత్త సుధాకర్, తేలు రాజు, గాండ్ల బిక్షపతి, బాలకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా మల్లన్న జాతర



**రామచంద్రపురం(సిరి న్యూస్ 01):** పటాన్‌చెరు నియోజకవర్గం తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఈదుల నాగులపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన మల్లన్న జాతర భక్తుల కోలాహలం మధ్య అత్యంత వైభవంగా జరిగింది. గ్రామ దేవాలయం ప్రాంగణం ఉదయం నుంచే భక్తులతో కిటకిటలాడింది. ఈ జాతరకు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి మల్లన్న స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మల్లన్న స్వామి కృపాకటాక్షాలు నియోజకవర్గ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. గ్రామాల అభివృద్ధి, దేవాలయాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రమేష్, శ్రీశైలం, రాజ్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతరను విజయవంతం చేశారు.

# పెద్ద శంకరం పేట ఎంఈఓగా వేణు శేఖర్



**పెద్ద శంకరం పేట, మార్చి 1, (సిరి న్యూస్):** పెద్ద శంకరం పేట మండల విద్యాధికారి గా వేణు శేఖర్ ఆదివారం నాడు పదవి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పని చేసిన డీ వెంకటేశం గత నెలలో పదవీ విరమణ పొందారు. ఈ స్థానంలో చీల పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో పి జీ హెడ్ మాస్టర్ గా పని చేస్తున్న వేణు శేఖర్ ను నియమిస్తూ విద్యా శాఖ ఆర్ జె డీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం నాడు స్థానిక మండల వనరుల కేంద్రం లో పదవి బాధ్యతలు స్వీకరించారు. పలువురు ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు నూతన ఎం ఈ ఓ ను కలసి తమ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టీ యు టీ ఎస్, తపస్, ఎస్ టీ యు సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

# చేపల వేటకు వెళ్లి యువకుడు గల్లంతు

**అమీన్‌పూర్, మార్చి 1, (సిరిన్యూస్)** అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాద ఘటన చోటుచేసుకుంది, ఇనిస్పెక్టర్ నరేష్ తెలిపిన వివరాలు ప్రకారం బొమ్మనికుంట గ్రామానికి చెందిన యాకరి రవి, యాదగిరి అనే ఇద్దరు మిత్రులు ఆదివారం సాయంత్రం 6 గంటల సమయంలో బొమ్మనికుంట చెరువు సమీపంలో ఉన్న కుంటలో చేపల వేటకు వెళ్లిన సందర్భంగ ప్రమాదం చోటు చేసుకుంది. చేపలు పట్టేందుకు వల వేయగ, అదే వలలో చిక్కుకుని యాకరి రవి నీటిలో గల్లంతైనట్లు స్థానికులు తెలిపారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా సలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన యువకుడి కోసం పోలీసులు, డిఆర్‌ఎఫ్ సహాయక బృందాలు చెరువులో విస్తృతంగ గాలింపు చర్యలు చేపట్టారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ నరేష్ తెలిపారు.

# నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం

- మహిధర లగ్జూరియా కాలనీ లో సమస్యల పరిష్కారానికి కృషి
- పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి




**పటాన్ చెరు, మార్చి 1, (సిరి న్యూస్):** నూతన కాలనీలలో దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం ముత్తంగి డివిజన్ పోచారం పరిధిలోని మహిధర లగ్జూరియా కాలనీలో శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి దేవాలయం నిర్మాణ పనుల కోసం ఏర్పాటు చేసిన భూమి పూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన దేవాలయం నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కాలనీలో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కారానికి అతి త్వరలో నిధులు కేటాయిస్తామని తెలిపారు. సీనియర్ నాయకులు తలారి బిక్షపతి, కోడూరి బిక్షపతి, కాలనీ అధ్యక్షులు స్వాతి, వైస్ ప్రెసిడెంట్ సురేంద్ర, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# అయ్యప్ప దేవాలయం వద్ద బోరు మోటార్ నుండి కేబుల్ వైర్ దొగ్గలించిన దొంగలు



**జిన్నారం మార్చ్ 01( సిరి న్యూస్ )** జిన్నారం మున్సిపాలిటీలోని ఊట్ల గ్రామం లో శనివారం రాత్రి అయ్యప్ప స్వామి గుడి ఆవరణలో ఉన్న బోర్ మోటార్ నుండి కేబుల్ వైర్ దొగ్గాలించిన దుండగులు గత కొన్ని రోజుల క్రిందట గుడిలోని గంటను కూడా దొగ్గలించారు అట్టి విషయం పై కౌన్సిలర్ బత్తుల మహేష్ , కౌన్సిలర్ వెంకటేష్, ఊట్ల గ్రామ అయ్యప్ప భక్తులు స్థానిక ఎస్సై హనుమంత్ కి కంప్లైంట్ ఇవ్వడం జరిగింది ఎస్సై హనుమంతు మాట్లాడుతూ అతి త్వరలో దొంగలను పట్టుకుని శిక్ష పడే విధంగా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఊట్ల గ్రామ కౌన్సిలర్ బత్తుల మహేష్, కౌన్సిలర్ వెంకటేష్, సుంకర బోయిన మహేష్, జింకల మధు,జాంగ్గిరెడ్డి, జింకల రవి, కర్రే నాగరాజు, బోగురు శ్రీనివాస్, జింకల శ్రీనివాస్, పాల్గొన్నారు

# ఐలాపూర్ లో ఘనంగా కేసీఆర్ క్రికెట్ ట్రోఫీ నిర్వహణ




**అమీన్ పూర్, మార్చ్ 1, (సిరిన్యూస్)** అమీన్‌పూర్ (జీహెచ్‌ఎంసీ) పరిధిలోని ఐలాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఐలాపూర్ మాణిక్ యాదవ్ ఆధ్వర్యంలో కేసీఆర్ క్రికెట్ ట్రోఫీ పోటీలు ఆదివారం ఘనంగా ముగిశాయి, బీరంగూడ, అమీన్‌పూర్ ప్రాంతాల్లోని క్రీడాకారులు మరియు యువతను ఏకం చేసి, ఒకే వేదిక పైకి తీసుకురావాలనే ముఖ్య ఉద్దేశంతో గత మూడు సంవత్సరాలుగా ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు మాణిక్ యాదవ్ తెలిపారు. గత సంవత్సరం పోటీల విజేతలకు మాజీ మంత్రి టి హరీష్ రావు చేతుల మీదుగా బహుమతులు అందజేశామని, ఈసారి అనివార్య కారణాల వల్ల ఆయన కార్యక్రమానికి హాజరు కాలేకపోయారని చెప్పారు. రాబోయే రోజుల్లో ఈ క్రికెట్ టోర్నమెంట్‌ను మరింత పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు మాణిక్ యాదవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, భారత రాష్ట్ర సమితి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శ్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని విజేత మరియు రన్నర్ జట్లకు బహుమతులు అందజేశారు. మొత్తం రూ.1,00,000 (లక్ష) ప్రైజ్ మనీ ప్రకటించగా, విజేత జట్టుకు రూ.70,000 మరియు రన్నర్ జట్టుకు రూ.30,000 నగదు బహుమతులు అందించారు. ఈ క్రికెట్ ట్రోఫీ ఇంత విజయవంతంగ నిర్వహించడానికి సహకరించిన పోలీస్ శాఖతో పాటు ఇతర శాఖల అధికారులకు, అలాగే పాల్గొన్న క్రీడాకారులకు, వచ్చిన అతిథులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా దగ్గరుండి కార్యక్రమాన్ని సజావుగ నిర్వహించిన మాణిక్ యాదవ్ యువసేన సభ్యులకు నిర్వాహకుడు ప్రత్యేకంగ కృతజ్ఞతలు తెలిపారు.

# బొంతపల్లి పారిశ్రామిక వాడలో నీటి వృథా



**గుమ్మడిదల, మార్చి 1 (సిరి న్యూస్):** గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలోని బొంతపల్లి పారిశ్రామిక వాడలో తాగునీటి వృథా ఆందోళన కలిగిస్తోంది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెనుక భాగంలో ఉన్న వాటర్ ట్యాంక్ నుంచి నీరు గంటల తరబడి వృథాగా పోతున్న పట్టించుకునే వారే కరువయ్యారు. ట్యాంక్ నిండిన వెంటనే మోటార్‌ను నిలిపివేయకపోవడం వల్ల నీరు అధికంగా వృథా అవుతోంది. ఇప్పుడిప్పుడే ఎండలు ప్రారంభమైన నేపథ్యంలో రానున్న రోజులలో తాగునీటి సమస్యలు తీవ్రమయ్యే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు నీటి కొరత భయం ఉండగా, మరోవైపు ఈ విధంగా నిర్లక్ష్యంగా నీరు వృథా కావడం బాధాకరమని వారు అంటున్నారు. మున్సిపల్ శాఖ సిబ్బంది పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొంటోందని ఆరోపిస్తున్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అదనంగా, నీటి సరఫరా పర్యవేక్షణకు ప్రత్యేక సిబ్బందిని నియమించి నిరంతర తనిఖీలు నిర్వహించాలని సూచిస్తున్నారు. తాగునీరు ప్రతి ఒక్కరికీ అవసరమైన అమూల్య వనరు కాబట్టి, నీటి వృథాను నివారించేందుకు సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# రైతులకు అందని రైతు భరోసా

- **ప్రభుత్వం మొద్దు నిద్రను వీడి రైతుల ఖాతాలో నిధులు జమ చేయాలి**
- **బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు భక్తుల వీరప్ప**

**టేక్మాల్ మార్చ్ 01: సిరి న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతు భరోసా నిధులు విడుదల చేయాలని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు భక్తుల వీరప్ప అన్నారు. ఈ నందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు సమయానికి కాంగ్రెస్ సర్కారు రైతు బంధు సాయం అందక రైతులు యాసంగి వరి నాట్లు కోసం అప్పులు చేసి వరి నాట్లు వేశారు. ప్రభుత్వం రైతుబంధు అందిస్తుండన్న ఆశతో రైతులు ఉన్నారన్నారు. కానీ ఇదిగో ఏస్తాం అదిగో వేస్తాం అని రైతులను మభ్య పెట్టడమే కానీ రైతుల ఖాతాలో రైతుబంధు నిధులు జమ చేయడం లేదని ప్రభుత్వంపై మండిపడ్డారు. మొన్న జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే రైతుల ఖాతాలో రైతుబంధు నిధులు జమ చేస్తామని ప్రకటించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ఆ ఊనే ఎత్తడం లేదని కాంగ్రెస్ సర్కార్ ను విమర్శించారు. ఎన్నికల ముందు ఎకరానికి రూ. 15 వేలు రైతుబంధు ఇస్తామని రైతులకు ఇచ్చి మాట ప్రకారం ఇప్పటికే రెండు సీజన్ల రైతు బంధుకు ఎగనామం పెట్టిన రేవంత్ సర్కార్ పెట్టారని, సెప్టెంబర్ మాసంలో వేయాల్సిన రైతుబంధు డబ్బులు మార్చి నెల వచ్చినా అందని రైతుబంధు సహాయం



ఇకనైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి రైతుల ఖాతాలో నిధులు జమ చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ■ మాంబోజిపల్లి సంతలో ఐదు తులాల బంగారు నగల చోరీ




**మెదక్ మార్చి (సిరిన్యూస్)** మాంబోజీపల్లి సంతలో 5తులాల బంగారు ఆభరణాలు చోరి అయిన సంఘటన శనివారం సాయంత్రం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రమైన కొల్చారంకు చెందిన చింతలగారి శ్రావణి ప్రవీణ్ భార్య భర్తలు మెదక్ వెళ్లి తిరుగు ప్రయాణంలో సంతలో కూరగాయలు తీసుకోవడానికి వెళ్ళారు. తమ వద్ద ఉన్న హాండ్ బ్యాగులో ఉన్న రూ.8లక్షల విలువ గల 5తులాల బంగారు నగలు నెక్లెస్ 2.5, నల్ల పూసలు 2తులలు,మాటిలు,చెవి కమ్మలు అరతులం చోరి జరిగాయి. బాధితులు కొద్దిసేపటికి హ్యాండ్ బ్యాగ్ చూడగా కనిపించకుండా పోవడంతో కంగుతిన్న బాధితులు మెదక్ లో రూరల్ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై లింగం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# రాష్ట్రస్థాయి ఐక్యరాజ్యసమితి పోటీలకు కాలకల్ బాలికలు



**మనోహరాబాద్, మార్చ్ 1. సిరి న్యూస్** రాష్ట్ర స్థాయిలో నిర్వహించే మోడల్ ఐక్యరాజ్య సమితి పోటీలకు మండలంలోని కాళ్ల కల్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఇద్దరు బాలికలు ఎంపికైనట్లు ప్రధాన ఉపాధ్యాయుడు హరికృష్ణ తెలిపారు. పీఎం శ్రీ పాఠశాలల కార్యక్రమాల్లో భాగంగా సోషల్ ఫోరం సహకారంతో మోడల్ ఐక్యరాజ్యసమితి పోటీలను శనివారం జిల్లా విద్యాధికారి విజయ ఆధ్వర్యంలో మెదక్ కలెక్ట రేట్ భవన్ లో నిర్వహించారని తెలిపారు. విద్యార్థులు 56 దేశాల ప్రతినిధులుగా, అంతర్జాతీయ జర్నలిస్టులుగా చర్చలో పాల్గొన్నారు. ఇందులో 11 మంది విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారన్నారు. ఈ సందర్భంగా తమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బాలికలు సమీక్ష, ఐశ్వర్య లు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమానికి గైడ్ టీచర్లుగా స్వరూపా రాణి, కవితలు వ్యవహరించారని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారితో పాటు స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు బాలికలను అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

# మజీద్ కమిటీ ఆధ్వర్యంలో కౌన్సిలర్ కు ఘన సన్మానం



**గజ్వేల్ మార్చి 01(సిరి న్యూస్)** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ 20 వ వార్డ్ కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్ కు ఆదివారం మహమ్మదీయ మజీద్ కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకులు మాట్లాడుతూ ప్రజల కష్టసుఖాల్లో తోడుగా ఉంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్న అత్తెల్లి శ్రీనివాస్ 20వ వార్డు స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి ఘన విజయం సాధించారు. శ్రీనివాస్ కు మంచి రాజకీయ భవిష్యత్తు ఉందని, రాబోయే రోజుల్లో మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వారు ఆకాంక్షించారు. రంజాన్ పవిత్ర మాసం సందర్భంగా వారికి చిరు సత్కారం చేసి అభినందనలు తెలియజేయడం జరిగిందని తెలిపారు. అనంతరం కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, హిందూ ముస్లిం భాయి భాయి అని, భారతదేశం సర్వతో ముఖాభివృద్ధికి ప్రజలంతా సమిష్టిగా ఉండాలని అన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ 20వ వార్డులో అందరం కలిసికట్టుగా ఉంటామని రాబోయే రోజుల్లో 20 వార్డు అభివృద్ధి కోసం అందరం కలిసి ఆదర్శవంత వార్డుగా చేయడం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని అన్నారు. అలాగే ముస్లిం సోదరీ సోదరీమణులకు రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు.

# ఉపాధ్యాయుల జీతాలపై తెలంగాణ విద్యా కమిషన్ రిపోర్ట్ అభ్యంతరకరం

**గజ్వేల్ మార్చి 01(సిరి న్యూస్)** <తెలంగాణ విద్యా కమిషన్ తెలంగాణ ప్రభుత్వానికి సమర్పించిన తెలంగాణ విద్యాపాలసి రిపోర్టును తెలంగాణలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటను చట్టబద్ధం చేస్తూ ఇచ్చిన రిపోర్టుగా తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ భావిస్తూ, కమిషన్ ఇచ్చిన రిపోర్ట్ లోని కొన్ని అంశాల పట్లఅభ్యంతరకరమని, దీనిపై విచారం వ్యక్తం చేస్తున్నామని టిపిటిఎఫ్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్ అన్నారు. గజ్వేల్ జోన్ కార్యాలయంలో మీడియా తో మాట్లాడుతూ కమిషన్ ఇచ్చిన రిపోర్టును పరిశీలిస్తే పల్లెల్లోని మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల మూసివేతను చట్టబద్ధం చేస్తున్నట్లుగా అనిపిస్తుందని అన్నారు. మండల పరిషత్ పాఠశాలల, జిల్లా పరిషత్ పాఠశాలల సమస్యలు, వాటి పరిష్కారాలు ప్రస్తావించకుండా తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు లక్ష్యంగా పనిచేస్తున్నటువంటి తెలంగాణ ప్రభుత్వం డైరెక్షన్ లోనే ఈ కమిటీ పని చేసిందని ఆరోపించారు. ఏ కమిషన్ అయినా ఒక ప్రత్యామ్నాయ వ్యవస్థను ప్రతిపాదించే ముందు ప్రస్తుత వ్యవస్థలో గల లోపాలు, కారణాలు చూపుతూ ప్రత్యామ్నాయ వ్యవస్థను ప్రతిపాదిస్తుంది కానీ తెలంగాణ విద్యా కమిషన్ ఆ విధంగా వ్యవహరించకపోవడం గమనార్హమని అన్నారు. ఎన్నో ఉద్యమాలతో సాధించుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ విద్యా పాలసీని రూపొందిస్తుంటే అది దేశంలో అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా ఉంటుందని అనుకున్నామని, కానీ కమిషన్ దాని పరిధిలో లేని అంశాలను ప్రస్తావిస్తూ ఉపాధ్యాయులను గందరగోళంలోకి నెట్టి, తెలంగాణ సమాజం దృష్టిలో ఉపాధ్యాయుల స్థాయిని తగ్గించే ప్రయత్నం చేసినట్లుగా మనకు కనిపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.విద్యారంగానికి 18 శాతం బడ్జెట్ కేటాయించాలనే ప్రతిపాదనను స్వాగతిస్తూ, ఉపాధ్యాయుల జీతాలు రేషనలైజ్ చేయాలని, ప్రతిభ ఆధారంగానే ప్రమోషన్లు ఇవ్వాలని సూచించడం కమిషన్ కు ఉపాధ్యాయ వర్గం పైన ఉన్న వ్యతిరేకతను సూచిస్తుందని తెలిపారు. ఉపాధ్యాయుల జీతాలను తీసుకుంటే ఢిల్లీ, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల కన్నా తక్కువ జీతాలు తెలంగాణలో ఉన్నాయని, ఉపాధ్యాయ జీతాలు తెలంగాణాలో ఎక్కువ ఉన్నాయని కమిషన్ పేర్కొనడం, కమిషన్ అవగాహన రాహిత్యానికి నిదర్శనమని అన్నారు.విద్య హక్కు చట్టం ప్రకారం ప్రతి కిలోమీటర్ కు ఒక ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయాలని అన్నారు. దాని ద్వారా బడుగు, బలహీన వర్గాల పిల్లలు విద్యకు దూరం కాకుండా ఉంటారని విద్యకు చట్టంలో పేర్కొనడం జరిగిందని గుర్తు చేశారు. కానీ విద్యా కమిషన్ విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడుస్తూ మండలానికి రెండు లేదా మూడు తెలంగాణ




పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటును ప్రతిపాదించడం, ఈ తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటుకు ఆరువేల కోట్ల బడ్జెట్ కేటాయింపు చేయాలనీ అనడం అసలే అప్పులలో ఉన్నరాష్ట్రం లో సాధ్యం కాదని స్పష్టం చేశారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో పనిచేసిన ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి సక్సెస్ స్కూల్స్, కిరణ్ కుమార్ రెడ్డి మోడల్ స్కూల్స్, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ గురుకులాల పేరుతోటి విద్యారంగాన్ని, ప్రభుత్వ పాఠశాలలను ప్రయోగశాలలుగా మార్చారని అన్నారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం పాఠశాల వ్యవస్థకి మూలాధారమైన ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటూ, ప్రస్తుతం ఉన్న పాఠశాలలకునిధులు కేటాయిస్తూ, పర్యవేక్షణ వ్యవస్థని పటిష్టం చేస్తూ, దశల వారీగా ప్రైవేట్ పాఠశాలలను రద్దు చేస్తూ ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ రాజులు, జోన్ కన్వీనర్ శ్రీనివాస్, వర్గల్, గజ్వేల్ మండలాల అధ్యక్షులు పర్వతం నర్సయ్య, తాళ్ల నాగరాజు, ములుగు మండల ప్రధాన కార్యదర్శి రాజనర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన మెకానికల్ బాజా సే పోటీలు



**నర్సాపూర్, మార్చి 01 (సిరి న్యూస్)** బి వి రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో నాలుగు రోజులుగా జరిగిన "ఈ బాజా సే ఇండియా 2026 బగ్గీల పోటీలు" ఆదివారం విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యా అతిథిగా మెదక్ జిల్లా అడిషనల్ సూపరింటెండెంట్ అఫ్ పోలీస్ సి.ఎస్. మహేందర్ హాజరైనారు వారు మాట్లాడుతూ బాజా సే ఇండియా పోటీలలో పాల్గొంటున్న టీమ్స్ కి అభినందనలు తెలియచేశారు. విద్యార్థులు సంతోషముగా క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలని అన్నారు.. ఈ కార్యక్రమంలో శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ ఆదిత్య విస్సం జాయింట్ సెక్రటరీ సాయి సుమంత్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో ఇటువంటి పోటీలు నిర్వహించడం ప్రథమమని ఈ పోటీలను 2024, 2025, 2026 సంవత్సరాలలో వరుసగా మూడు సార్లు నిర్వహించబడిన ఘనత తమ ఇంజనీరింగ్ కాలేజీకి చెందుతుందని అన్నారు ప్రధాన కార్యక్రమంలో ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ దూబే మాట్లాడుతూ తమ కళాశాలలో జాతీయ స్థాయి పోటీలు బాజా పోటీలు నిర్వహించటం మొదొవ సారి అని మా శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చెర్మన్ కె వి విష్ణురాజు దూరదృష్టి కోర్ ఇంజనీరింగ్ యొక్క ప్రాధాన్యతను తెలిపేందుకు ఉద్యోగ అవకాశాలు విద్యార్థులకు పుష్కలంగా వచ్చేందుకు నిరంతరం పరితపిస్తారని వారి ఆలోచన రూపమే నేటి ఈ భారీ ఖర్చుతో కూడిన పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు ఈ కార్యక్రమానికి అతిథిగా మహేష్ బాబు, మేనేజింగ్ డైరెక్టర్, ఒలెక్ట్రా , పాల్గొన్నారు,.డాక్టర్ జి నాగరాజన్, ప్రెసిడెంట్ సే ఇండియా, షహే కోయెన్, బి 2 బి అమ్మకాలు, మార్కెటింగ్ సలహాదారుడు హెచ్ఐపిపి, విశిష్ట అతిథిగా శ్రవణ్ కుమార్, టెరిటరీ మేనేజర్ రిటైల్, భారత్ పెట్రోలియం పాల్గొన్నారు ఎం బాజా సే ఇండియా కన్వీనర్ అలీ సయ్యద్, జాయింట్ కన్వీనర్ డాక్టర్ వేముల మురళికృష్ణ, ప్రొఫెసర్ అఫ్ మెకానికల్ ఇంజనీరింగ్ బి వి రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నర్సాపూర్ వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి దేశ వ్యాప్తంగా 11 రాష్ట్రాల నుండి 1500 వందల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారని తెలియపరిచారు. మొత్తం 51 బగ్గీలు నమోదు చేసుకోగా చివరి పోటీ సమయానికి 32 బగ్గీలు మాత్రమే అర్హత సాధించాయని. మహారాష్ట్ర 13 తమిళనాడు 9 టీమ్స్, ఆంధ్ర ప్రదేశ్ 4 కర్ణాటక 4 కేరళ 4 తెలంగాణ 4 ఝార్ఖండ్ 2 మధ్యప్రదేశ్ 2 ఢిల్లీ, హరియాణా, పంజాబ్ ఒక్కొక్క టీమ్స్ పాల్గొన్నాయని తెలియపరిచారు.

**ఈ ఉత్కంఠ పోటీలలో విజేతలు:**01. మొదటి బహుమతి : డాక్టర్ విశ్వనాథ్ కరద్ MIT వరల్డ్ పీస్ యూనివర్శిటీ, పూణె, బహుమతి నగదు రూ.150000/-

02. రెండవ బహుమతి: KLE సాంకేతిక విశ్వవిద్యాలయం, కర్ణాటక, బహుమతి నగదు రూ.100000/-

03. మూడవ బహుమతి: డివై పాటిల్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, కొల్హాపూర్, , బహుమతి నగదు రూ.75000/-

04. వాహన స్థిరత్వానికి రెండవ బహుమతి ఆంధ్రప్రదేశ్‌లోని భీమవరంలోని శ్రీ విష్ణు ఇంజనీరింగ్ ఫర్ ఉమెన్‌కు దక్కింది. బహుమతి నగదు రూ.20,000/

05. వాహన తయారీ ఎక్సలెన్స్ అవార్డు మొదటి బహుమతి ఆంధ్రప్రదేశ్‌లోని భీమవరంలోని శ్రీ విష్ణు ఇంజనీరింగ్ ఫర్ ఉమెన్‌కు దక్కింది. బహుమతి నగదు రూ.40,000/

06. వెహికల్ కంప్యూటర్ ఎయిడెడ్ ఇంజనీరింగ్ అవార్డు మొదటి బహుమతి ఆంధ్రప్రదేశ్‌లోని భీమవరంలోని శ్రీ విష్ణు ఇంజనీరింగ్ ఫర్ ఉమెన్‌కు దక్కింది. బహుమతి నగదు రూ.30,000

07. బి వి రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుండి డాక్టర్ ముత్తు లాగు బాజా సే ఇండియా 2026 ద్రోణాచార్య అవార్డు గ్రహీత గా ఎంపికయ్యారు

ఈ కార్యక్రమాల్లో బివి రాజు ఇన్‌స్ట ిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ డాక్టర్ సంజయ్ దూబే, డైరెక్టర్ డాక్టర్ లక్ష్మి ప్రసాద్, బాలాజ్ సుబ్రమణ్యం, చెర్మన్, ఆర్గనైజింగ్ కమిటీ, డాక్టర్ కె.సి.వోరా, బాజా సే ఇండియా సలహాదారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో..
# మాదిగ అమరవీరులకు ఘన నివాళి



**గజ్వేల్ మార్చి 01 (సిరి న్యూస్)** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 30 సంవత్సరాలు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఉద్యమంలో అసువులు బాసిన మాదిగ అమరవీరులకు గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామ ఎమ్మార్పీఎస్ కమిటీ ఆధ్వర్యంలో నివాళి అర్పించి వారి త్యాగాలను స్మరించుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు ముంద్రాతీ కృష్ణ మాదిగ పాల్గొన్నారు. మాదిగ ఉద్యోగులు ముంద్రాతీ రవి, ముం ద్రాతీ రాజు, కొడిశాల గిరి బాబు, ముం ద్రాతీ నరేష్,ఎమ్మార్పీఎస్ నాయకులు ,నాగరాజు, శివ కుమార్, నవీన్, కార్తీక్,అంజి, నరేందర్, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## తూప్రాన్ గీతా స్కూల్ లో
# ఘనంగా ఫేర్ వెల్ వేడుకలు



**తూప్రాన్ మార్చ్ 01 సిరి న్యూస్** తూప్రాన్ గీతా స్కూల్ లో ఆదివారం రోజు 10 వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు పాఠశాల ప్రాంగణంలో జరిగిన వేడుకల్లో తొమ్మిదవ తరగతి విద్యార్థులు పదవ తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేసి పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు..ఈ సందర్భంగా పాఠశాల చైర్ పర్సన్ పి. ఉష మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి దేశ సేవలో భాగం కావాలని క్రమశిక్షణతో ఉంటూ తల్లిదండ్రుల కలలను నిజం చేస్తూ ఉన్నతమైన లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ పి. రామాంజనేయులు డైరెక్టర్లు భరత్ మౌనిక రాఘవేందర్ గౌడ్ నారాయణ గుప్త ప్రిన్సిపాల్ రజనీష్ గౌతమ్ ఇంచార్జి ప్రిన్సిపాల్ ప్రేమ్ రాజ్ మరియు ఉపాధ్యాయులు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు

# తెల్లాపూర్‌లో కొత్త రైల్వే అండర్ బ్రిడ్జ్ మంజూరు



- స్థానికులతో చర్చించిన మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు

**రామచంద్రపురం(సిరి న్యూస్ 01):** ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు అభివృద్ధి పనులను దశలవారీగా అమలు చేస్తున్నామని మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు తెలిపారు ఆదివారం తెల్లాపూర్‌లోని రైల్వే అండర్ బ్రిడ్జ వద్ద స్థలాన్ని స్థానికులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, బిఎచ్‌ఈఎల్ ఎంఐజి (BHEL MIG) సొసైటీ నుండి తెల్లాపూర్ సాయిబాబా ఆలయానికి వెళ్లే మార్గంలో ఉన్న ప్రస్తుత రైల్వే అండర్ బ్రిడ్జ్ (RUB) ట్రాఫిక్ అవసరాలను తీర్చలేకపోతుండటంతో రైల్వే అధికారులతో చర్చించి కొత్త రైల్వే అండర్ బ్రిడ్జ్‌ను అధికారికంగా మంజూరు చేయించామని వెల్లడించారు. ఈ కొత్త అండర్ బ్రిడ్జ్ నిర్మాణానికి అవసరమైన రోడ్డు విస్తరణ పనులపై స్థానికులతో సమావేశమై చర్చించగా, ప్రజలు సహకరించేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. అదేవిధంగా, తెల్లాపూర్ ఎంఐజి నుండి రేడియల్ రోడ్ (RR-7) ప్రాంతానికి సరైన రోడ్డు కనెక్టివిటీ లేకపోవడంతో కొత్త రైల్వే ఫుట్ బ్రిడ్జ్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించామని చెప్పారు. ప్రస్తుతం తెల్లాపూర్ వరకు ఆగుతున్న రైళ్లను ఈదులనాగులాపల్లి వరకు విస్తరించే అంశంపై దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌తో త్వరలో అధికారిక సమావేశం ఏర్పాటు చేసి చర్చించనున్నట్లు వెల్లడించారు. ఇంకా, పటాన్‌చెరు (NH-65) - ఇక్రిశాట్ వద్ద నుండి ప్రారంభమై రేడియల్ రోడ్ (RR-7) వరకు, ఈఎస్ఐ హాస్పిటల్ ముందు నుంచి అన్నమయ్య కాలనీ పక్కనుండి తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం వరకు కొత్త రోడ్డు నిర్మాణంపై జిహెచ్ఎంసి మరియు భేల్ అధికారులతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. త్వరలోనే ఈ రోడ్డు పనులను ప్రారంభించి వేగంగా పూర్తి చేయడానికి కృషి చేస్తామని ఎంపీ మాధవనేని రఘునందన్ రావు స్పష్టం చేశారు. ప్రాంత అభివృద్ధి కోసం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా దిశ కమిటీ సభ్యులు కాసాల సుధాకర్, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు రాజేందర్ రెడ్డి, తెల్లాపూర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు రాంబాబు గౌడ్, మాజీ కౌన్సిలర్స్ శంషాబాద్ రాజు, లచ్చిరాం, నాయకులు నరసింహారెడ్డి, సుధాకర్, మురళి, సంతోష్ గౌడ్ , శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# పదవి లేకున్నా ప్రజల్లోనే ఉంటా





**జిన్నారం మార్చ్ 01 (సిరి న్యూస్)** జిన్నారం మున్సిపాలిటీలోని రెండో వార్డు శివాలయం కాలనీలో ఆదివారం ఉదయం కాలనీ వాసులతో బస్తీబాట కార్యక్రమం నిర్వహించారు. వార్డుల్లో ఉన్న పలు సమస్యల గురించి కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,పదవి లేకున్నా ఎల్లప్పుడూ ప్రజల్లోనే ఉంటానని జిన్నారం బిఆర్ఎస్ నాయకులు బండి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో తనకు ఓటేసిన ప్రతీ ఒక్కరికి, తన కోసం అహర్నిశలు కృషి చేసిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు, నాయకులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.తాను ప్రజా సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చానన్నారు.పదవులు ఉన్నా, లేకున్నా తన ప్రజా సేవ ఆగదని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో జిన్నారం గడ్డమీద బీఆర్ఎస్ గెలుపు కోసం తీవ్రంగా శ్రమించామన్నారు. ఎన్నికల ఫలితం తమ అంచనాలకు భిన్నంగా వచ్చిందన్నారు.కార్యకర్తలందరికీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని అన్నారు.15 రోజుల పాటు సాగిన ఎన్నికల మహత్తర పోరాటంలో జిన్నారం ప్రజల తీర్పును తాను నిండు మనస్సుతో గౌరవిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎప్పటిలాగే అభివృద్ధి, అందుబాటు అనే నినాదంతోనే ప్రజల మధ్యే ఉంటూ నిరంతరం ప్రజాసేవలో భాగం అవుతానని స్పష్టం చేశారు. ఎన్నికల ఫలితాలపై బిఆర్ఎస్ కార్యకర్తలు, శ్రేయోభిలాషులు ఎవరూ చింతించాల్సిన పని లేదన్నారు.ప్రజలకు మరింత చేరువయ్యేందుకు కృషి చేస్తానన్నారు. రానున్న రోజుల్లో మరింత కష్టపడి ఉన్నత శిఖరాలను చేరుకునేందుకు ఫీనిక్స్ పక్షి మాదిరి కింద నుంచి పైకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు.

# ఒకరోజు విజ్ఞాన విహార యాత్రకు ఖదిరాబాద్ స్కూల్ విద్యార్థులు







**వట్పల్లి, మార్చి 1, (సిరి న్యూస్):** మండల పరిధి లోని ఖాధిరాబాద్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఆదివారం ఒక రోజు విజ్ఞాన, విహార యాత్ర కు బయలు దేరి వెళ్లారు. హైదరాబాద్ లోని వివిధ ప్రాంతాల్లో ఉన్న చారిత్రిక కట్టడాలు. విద్యార్థులకు చూపించి వారికి ఆ విషయాల పై అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యం తో ఈ విజ్ఞాన విహార యాత్ర ఏర్పాటు చేసినట్లు హెడ్ మాస్టర్ కవిత కుమారి తెలిపారు. చిలుకూరు బాలాజీ ఆలయం, ఓషియన్ పార్క్, శిల్పా రామం, ప్రాంతాల్ని విద్యార్థుల కు చూపి వాటికి సంబంధించిన వివరాలు వారికి తెలిపేందుకు ఈ యాత్ర ఏర్పాటు చేసినట్లు హెడ్ మాస్టర్ కవిత కుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది అలేఖ్య, శ్రీనివాస్, సిద్ధప్ప, లక్ష్మి. పార్వతమ్మ, తదితరులు ఉన్నారు.

## మాజీ సీఎం కేసీఆర్‌కు వివాహ ఆహ్వానం అందజేత



**మునిపల్లి, మార్చి 1 (సిరి న్యూస్):** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావును టీఎన్జీఓస్ సెంట్రల్ యూనియన్ మాజీ అధ్యక్షుడు మామిళ్ళ రాజేందర్ మర్యాదపూర్వకంగా కలిసి తమ కుమారుడి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా వధువు తరపున మునిపల్లి మండలం చిన్నచెల్మెడ గ్రామ మాజీ సర్పంచ్ గాడిఖన విజయ భాస్కర్ కుటుంబ సభ్యులు హాజరయ్యారు.ఆత్మీయంగా జరిగిన ఈ సమావేశంలో కుటుంబ సభ్యులు వివాహానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించాలని కోరారు.

## మాదారం ప్రీమియర్ లీగ్ విజేతగా ఎల్ ఎస్ జి యువసేన సేన



**జిన్నారం మార్చ్ 01 (సిరి న్యూస్)** గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని మాదారం గ్రామంలోమాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మాదారం ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహభరితంగా ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో అద్భుత ఆటతీరు ప్రదర్శించిన ఎల్ఎస్‌జీ యువసేన జట్టు విజేతగా నిలిచి ప్రథమ బహుమతిగా 15,000 నగదు అందుకుంది. ద్వితీయ స్థానం దక్కించుకున్న మాదారం-2 జట్టు 10,000 బహుమతిని అందుకుంది. గడ్డపోతారం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐక్యత పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సురేందర్ గౌడ్, కౌన్సిలర్లు నవీన్, మల్లేష్, స్వాతి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## గుమ్మడిదలలో సీసీ రోడ్డుపై నీటి నిల్వ



**గుమ్మడిదల, మార్చి 1 (సిరి న్యూస్) :**మున్సిపాలిటీ కేంద్రమైన గుమ్మడిదలలో ముదిరాజ్ సంఘం భవనం ముందున్న సీసీ రోడ్డుపై నీరు నిల్వ ఉండడంతో దోమలు విస్తరిస్తున్నాయి. నిల్వ నీటిలో దోమలు పెరిగి చుట్టుపక్కల ప్రాంతాల్లో సైర విహారం చేస్తుండటంతో స్ధానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై నీరు నిల్వ ఉండటంతో చిన్నపిల్లలు అక్కడే ఆడుకోవడం ప్రారంభించడంతో ఆరోగ్యపరమైన ప్రమాదాలు ఏర్పడే అవకాశం ఉందని వార్డు ప్రజలు వాపోతున్నారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉన్నప్పటికీ, ఈ సమస్యపై కౌన్సిలర్లు మరియు అధికారులు తగిన శ్రద్ధ చూపి సమస్య పరిష్కరించాలని వారు కోరారు.

Published by **Badhe Jayasree** on behalf of **Siri Media**. Published at Flat No. 104, Kapil Kausalya Apartment, Shilpa Cereny County Vencher, Near MBR Garden, Pothireddypally X Road, Sangareddy, Telangana State - 502201. Phone : **9697889922**. E-Mail : **siridailynews@gmail.com**.